సాక్షి
వనపర్తి
మంగళవారం ׀ 1 ׀ అక్టోబర్ ׀ 2024



సెకండ్ ఇన్నింగ్స్..

సీనియర్ సిటిజన్స్ ఫోరం సభ్యులు సమాజ హితమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు.

వివరాలు 8లో ▸



11 యూనిట్లలో విద్యుదుత్పత్తి

జూరాల జలాశయం కుడి, ఎడమ కేంద్రాల్లోని 11 యూనిట్లలో విద్యుదుత్పత్తి కొనసాగుతుంది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
36.7 /23.8

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'ప్రజావాణి' అర్జీలకు సత్వర పరిష్కారం



వనపర్తి: ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి ఆయనతో రెవెన్యూ అదనపు కలెక్టర్ నగేష్ హాజరై అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం ప్రజావాణి నుంచి జిల్లాకు ఇప్పటి వరకు 297 ఫిర్యాదులు అందగా ఇప్పటి వరకు 114 ఫిర్యాదులు పరిష్కారం అయ్యాయని, 183 ఫిర్యాదులు వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఎక్కువగా రెవెన్యూశాఖలో పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. సీఎం ప్రజావాణి వినతులను సైతం కలెక్టరేట్ ప్రజావాణి అర్జీలతో సమానంగా పర్యవేక్షించి పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమస్య పరిష్కారంతో ఫిర్యాదుదారుడి మనోభావాలు, స్పందనను సమర్పించాల్సిందిగా సూచించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం భోజన విరామ సమయం వరకు 55 అర్జీలు రాగా.. పరిష్కారానికి ఆయా శాఖల అధికారులకు సిఫారస్ చేశారు.

అత్యధిక పనిదినాలు కల్పించాలి

జిల్లాలోని ఉపాధిహామీ కూలీలకు 2025–26 ఆర్థిక సంవత్సరంలో అత్యధిక పనిదినాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు, జిల్లా, మండల పరిషత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనుల ఎంపిక, గ్రామసభల నిర్వహణపై అవగాహన కల్పించారు. డీఆర్డీఓ ఉమాదేవి, జెడ్పీ సీఈఓ యాదయ్య, అదనపు జెడ్పీ సీఈఓ రామమహేశ్వర్‌రెడి పాల్గొన్నారు.

12 ఫిర్యాదులు దాఖలు



జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 12 అర్జీలు దాఖలయ్యాయి. ఎస్పీ రావుల గిరిధర్ అర్జీదారులతో వినతులు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసున్నారు. పరిష్కారానికి ఆయా ఎస్‌హెచ్‌ఓలకు సిఫారస్ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా పోలీసు సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. దాఖలైన అర్జీల్లో భూ తగాదాలకు సంబంధించి 7, పరస్పర గొడవల అర్జీలు 3, భార్యభర్తల గొడవలకు సంబంధించి 2 ఉన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల్లో ఆనందం

వనపర్తి: రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ ఫలితాలను సోమవారం జిల్లాల వారీగా విడుదల చేసింది. సబ్జెక్టుల వారీగా రోస్టర్ విధానంలో ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున ధ్రువపత్రాలు పరిశీలించేందుకు విద్యాశాఖ రంగం సిద్ధం చేసింది. మంగళవారం నుంచి ఐదురోజుల పాటు ధ్రువపత్రాల పరిశీలన కొనసాగనుంది. గత ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులు స్వీకరించినా.. ప్రస్తుత ప్రభుత్వం పోస్టుల సంఖ్యను పెంచి తిరిగి మార్చి 1 నోటిఫికేషన్ ఇచ్చి జులై 18 నుంచి ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్ పద్ధతిన పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ఫలితాలు వెల్లడించి దసరా పండుగ వరకు నియామక పత్రాలు అందించాలని విద్యాశాఖను ఆదేశించారు. ఇదిలా ఉండగా.. వనపర్తి జిల్లాలో 152 ఖాళీలకుగాను అర్హత పరీక్షలను వేల సంఖ్యలో రాశారు. అత్యధికంగా ఎస్జీటీ (తెలుగు మీడియం) 50, స్పెషల్ గ్రేడ్ టీచర్ పోస్టులు 19, బయోసైన్స్ 13, సోషల్ స్టడీస్ 19, పీఈటీలు, పీడీలతో పాటు ఆయా కేటగిరి పోస్టులు ఒకటి నుంచి ఐదులోపు ఖాళీలున్నట్లు విద్యాశాఖ వెల్లడించిన నివేదికలో పేర్కొన్నారు. ఈ పోస్టులను రోస్టర్ పద్ధతిలో భర్తీ చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఓపెన్ కేటగిరితో పాటు ఓసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ–ఏ, బి, సి, డి, ఈ, పీహెచ్‌సీ, ఈడబ్ల్యూఎస్, స్పోర్ట్స్, ఎక్స్ సర్వీస్‌మెన్ కేటగిరీల వారీగా ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున ధ్రువపత్రాల పరిశీలనకు పిలువనున్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థులకు రాష్ట్ర విద్యాశాఖనే నేరుగా వారి సెల్‌ఫోన్లకు మెస్సేజ్‌లు పంపనున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ విద్యాధికారి గోవిందరాజులు తెలిపారు.

జిల్లా టాపర్లు వీరే.. : ఫిజికల్ సైన్స్‌లో ఎం.రవికుమార్ (73.47), ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో అక్కల రవికిరణ్‌గౌడ్ (66.0), ఎస్‌ఏ గణితంలో ఎండీ పాషా (73.70), ఎస్‌ఏ (హిందీ)లో పోతుల గీతాంజలి (67.13), ఎస్‌ఏ బయోసైన్స్ (ఉర్దూ)లో రుబీనా బేగం (55.27), ఎస్‌ఏ బయోసైన్స్ (తెలుగు)లో పి.మనీష్ (80.13), తెలుగు పండిట్ బి.శ్రీకాంత్ (79.37), హిందీ స్వామి లోకనాథ్ వ్యకాంత్ (62.10) జిల్లా టాపర్లుగా నిలిచారు.

విద్యాధికారులొచ్చారు

అన్ని మండలాలకు ఎంఈఓలను నియమించిన ప్రభుత్వం



అమరచింత కేజీబీవీలో విద్యార్థితో మాట్లాడుతున్న విద్యాధికారి భాస్కర్‌సింగ్ (ఫైల్)

- ప్రభుత్వ పాఠశాలలపై పెరగనున్న పర్యవేక్షణ
- గతంలో జిల్లాలో ఒక్కరే రెగ్యులర్ ఎంఈఓ.. రెండు, మూడు మండలాలకు ఇన్‌చార్జ్‌లు

అమరచింత: కొన్నేళ్లుగా విద్యాశాఖలో ఎంఈఓల పోస్టులు ఖాళీగా ఉండటం.. పలువురు ప్రధానోపాధ్యాయులకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడంతో పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంఈఓలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో 15 మండలాలు ఉండగా.. 13 మంది ఎంఈఓలు నియమితులయ్యారు. రెండు మండలాల్లో జీహెచ్‌ఎంలు లేకపోవడంతో స్కూల్ అసిస్టెంట్లకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. ఉపాధ్యాయుల పనితీరుతో పాటు ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ, ఉత్తీర్ణత శాతం పెరగడంతో పాటు ఉపాధ్యాయుల సమస్యలు, పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించడమే కర్తవ్యంగా ముందుకు సాగనున్నారు.

జిల్లాలో ఇలా..

మండలాలు 15	గ్రామపంచాయతీలు 255
ప్రాథమిక పాఠశాలలు 353	ప్రాథమికోన్నత పాఠశాలలు 59
ఉన్నత పాఠశాలలు 102	కేజీబీవీలు 15
	మోడల్ స్కూళ్లు 3
విద్యార్థుల సంఖ్య : 42 వేలు	

నిత్య పరిశీలన..

ఎంఈఓలను నియమించడంతో ఇక నుంచి మండలంలోని పాఠశాలలను నిత్యం తనిఖీచేసే అవకాశం ఉంటుంది. ఉపాధ్యాయులు హాజరు, బోధనను ఆకస్మిక తనిఖీల ద్వారా తెలుసుకోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తల్లిదండ్రులు భావిస్తున్నారు.

విద్యా ప్రమాణాలపై దృష్టి..

ఎంఈఓలను పూర్తిస్థాయిలో నియమించడంతో ఇకపై పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు గాడినపడే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పాఠశాలల్లోని సమస్యలు తెలుసుకోవడమే కాకుండా వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించే అవకాశం ఉంటుంది. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలతో పాటు ఉపాధ్యాయుల సమస్యలను సైతం పరిష్కరించే వీలుందని ఉపాధ్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

పని భారం తగ్గనుంది..

గతంలో అమరచింత, ఆత్మకూర్ మండలాల విద్యాధికారిగా విధులు నిర్వర్తించా. రెండు మండలాల్లో కలిపి 62 పాఠశాలలు ఉన్నాయి. నిత్యం రెండు పాఠశాలలు తనిఖీ చేసినా నెల రోజుల్లో పూర్తయ్యేవి కాదు. ప్రస్తుతం ఒకే మండలం బాధ్యత ఉండటంతో పాఠశాలల తనిఖీలతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకొని త్వరగా పరిష్కరించే అవకాశం ఉంటుంది.

– భాస్కర్‌సింగ్,
ఎంఈఓ, అమరచింత

విద్యా ప్రమాణాల పెంపునకు..



ప్రభుత్వం ఎంఈఓలను నియమించడంతో పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడే అవకాశం ఉంది. ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకోవడం, మధ్యాహ్న భోజనంలో నాణ్యత, స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించుకోవడం, పాఠశాలల పర్యవేక్ష తదితర కార్యక్రమాలు నిర్వహించడంతో ఉత్తీర్ణత శాతం పెంచుకునే అవకాశం ఉంటుంది.

– గోవిందరాజులు,
ఇన్‌చార్జ్ డీఈఓ

● షరా 'మామూళ్లు'

'చేతులే' మారాయి!

- ఉమ్మడి పాలమూరులో యథేచ్ఛగా కల్తీ కల్లు దందా
- 'అధికార' నేతల బినామీలే మాఫియా అవతారం
- నిషేధిత ఆల్ఫాజోలం, డైజోఫాం వినియోగం
- కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో సీహెచ్ సైతం..
- ముడుపులతో నిద్ర 'మత్తు' వీడని ఆబ్కారీ యంత్రాంగం
- సీసాకు రూ.10 నుంచి రూ.20 వరకు ధర పెంచి విక్రయాలు
- సామాన్యుల జీవితాలతో చెలగాటం
- మత్తు వదలలేని స్థితిలో పలు దారుణాలు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఉమ్మడి పాలమూరులో కల్తీ కల్లు ఏరులై పారుతోంది. ప్రభుత్వాలు మారిన నేపథ్యంలో కల్తీ కల్లు మామ్లాలో వ్యక్తులు మారారు తప్ప.. దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. 'అధికార' నేతల బినామీలే మాఫియా అవతారం ఎత్తగా.. కల్లు తయారీలో నిషేధిత ఆల్ఫాజోలం, డైజోఫాంను ఎక్కువ మొత్తంలో వినియోగిస్తూ సామాన్యుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో క్లోరో హైడ్రేట్ (సీహెచ్)ను సైతం వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. మత్తు వదలలేని స్థితిలో పలు దారుణాలు చోటుచేసుకుంటున్నప్పటికీ.. ఆబ్కారీ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఏడాది క్రితం వరకు ఓ పార్టీకి చెందిన వ్యక్తులు కల్లు మామ్లాలో కీలకంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో అధికారం చేతులు మారగా.. ఇదే క్రమంలో పాలమూరులోని ఐదు జిల్లాలో సైతం కల్తీ కల్లు ఆధిపత్యం చేతులు మారింది. మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రస్తుతం 'అధికార' పార్టీకి చెందిన ఒకరు చక్రం తిప్పుతున్నారు. తన పరిధిలో అనధికార దుకాణాల సంఖ్య పెంచడమే కాకుండా పట్టణంలో రూ.20 ఉన్న సీసా ధరను రూ.25 పెంచారు. గ్రామాల్లో ఏకంగా రూ.8 పెంచి విక్రయిస్తున్నారు. ఈ ఒక్క డిపో పరిధిలో రోజుకు సుమారు రూ.2.50 లక్షల వరకు ఆదాయం వస్తుండగా.. పెంచిన ధరతో రోజుకు రూ.లక్ష వరకు అదనంగా సమకూరుతున్నట్లు అంచనా.

పుట్టగొడుగుల్లా దుకాణాలు.. పైగా ధరల పెంపు

ఉమ్మడి జిల్లాలో టీసీఎస్ డిపోల లైసెన్స్ దారులు 312 మంది, టీఎఫ్‌టీ లైసెన్స్ దారులు (కల్లు గీత కార్మికులు) 772 ఉన్నారు. డిపోలకు సంబంధించి మున్సిపాలిటీల్లో గతంలో 10నుంచి 20 దుకాణాలు ఉండగా.. ప్రస్తుతం 20నుంచి 30 వరకు పెరిగినట్లు సమాచారం. గ్రామాల్లో గతంలో రెండు నుంచి ఐదు వరకు కల్లు దుకాణాలు ఉండగా.. ఇటీవల కాలంలో రెట్టింపు సంఖ్యలో అనధికార దుకాణాలు వెలిసినట్లు తెలుస్తోంది. అంతే కాదు సీసాకు ప్రాంతాల వారీగా రూ.5 నుంచి రూ.15వరకు పెంచి విక్రయాలు చేస్తూ సామాన్యుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారు.

ఆమ్యామ్యాలతో ఎర..

ఆయా జిల్లాల్లో ఏర్పాటు చేసిన కల్లు డిపోల నిర్వాహకులు తమ అక్రమ వ్యాపారానికి అడ్డు తగలకుండా అబ్కారీ, పోలీస్‌శాఖలోని పలువురికి ఆమ్యామ్యాలు ఎరవేస్తున్నారు. ప్రభుత్వ విభాగాలు, రాజకీయ నేతల వారీగా లెక్కలేసి నెలనెలకూ ముడుపులు ఇస్తున్నట్లు తెలుస్తోంది. మహబూబ్‌నగర్‌లో ఓ ఎక్సైజ్ అధికారికి నెలకు రూ.50 వేలు, ఇతర సిబ్బందికి రూ.5వేలు, పోలీస్‌శాఖ సిబ్బందికి రూ.5వేల నుంచి రూ.10వేల వరకు ముడుపులు అందుతున్నట్లు ఆరోపణలున్నాయి.

అంతా కృత్రిమమే..

ఉమ్మడి జిల్లాలో ఈత, తాటి వనాలు అంతంతే. వాస్తవంగా చారగొండ వంటి గ్రామాల్లో ఒకరిద్దరు మాత్రమే గీసి కల్లు తీస్తారు. మిగతా ప్రాంతాల్లో దాదాపుగా ఎక్కడ కూడా వాటిని గీసే వారు లేరు. కానీ ఉమ్మడి జిల్లాలో కల్లు ఏరులై పారుతోంది. ఇదంతా కృత్రిమ కల్లే.. పూర్తిగా రసాయనాలు (నిమ్మ ఉప్పు, సిల్వర్, శాక్రిన్, డ్రైఈస్ట్, ఆల్ఫాజోలం లేదా డైజోఫాం లేదా సీహెచ్) కలిపి తయారు చేస్తున్నారు. పులుపు రావడానికి నిమ్మ ఉప్పు, తెలుపు రంగు కోసం సిల్వర్ (వైట్), తీపి కోసం శాక్రిన్, నురుగు కోసం డ్రైఈస్ట్‌తో పాటు కుంకుడుకాయల రసాన్ని వినియోగిస్తున్నారు. వీటితో పాటు మత్తు కోసం ఆల్ఫాజోలం లేదా డైజోఫాం లేదా క్లోరల్ హైడ్రేట్ (సీహెచ్)ను వినియోగిస్తున్నారు.

కూలీలు, కార్మికులే బలి..

మందు కల్లు తాగుతున్న వారందరూ దాదాపుగా సామాన్య, మధ్య తరగతి ప్రజలే. వ్యవసాయ పనులకెళ్లే కూలీలు, అడ్డా కూలీలు, పారిశుద్ధ్య కార్మికులే అధికంగా దీనికి అలవాటు పడి వ్యసనపరులుగా మారుతున్నారు. మందు కల్లు తాగడం ఆపేస్తే మానసిక స్థితి గతి తప్పడం.. ఫిట్స్ రావడం.. నాలుక కరుచుకుంటూ పిచ్చిపిచ్చిగా ప్రవర్తించడం వంటి ఘటనలు కోవిడ్ కాలంలో అధికంగా వెలుగుచూసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం మత్తు మోతాదును పెంచడంతో వారు తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నట్లు తెలుస్తోంది.

కచ్చితంగా చర్యలుంటాయి..

కల్లు తయారీలో నిషేధిత మత్తు పదార్థాలను వినియోగించొద్దు. అనధికార దుకాణాలకు సంబంధించి తనిఖీలు చేపడుతాం. వాటిపై కచ్చితంగా చర్యలుంటాయి. ఆబ్కారీ శాఖలో ఎవరికైనా ముడుపులు అందినట్లయితే.. నా దృష్టికి తీసుకురండి. రుజువులు చూపితే ఎవరైనా సరే.. చర్యలు తప్పవు.

– శ్రీనివాస్‌రెడ్డి,
ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్ శాఖ

మోతాదుకు మించి ఆల్ఫాజోలం.. పెరుగుతున్న దారుణాలు

కృత్రిమంగా తయారు చేస్తున్న కల్లులో మత్తు కోసం ఆల్ఫాజోలంను మోతాదుకు మించి కలుపుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కల్లు మత్తులో చోటు చేసుకున్న దారుణాలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. గద్వాలలో కల్తీ కల్లుకు బానిసగా మారిన ఓ మహిళ ఇటీవల పిచ్చి పట్టినట్లు ప్రవర్తిస్తూ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అదేవిధంగా జడ్చర్లలో ఓ మహిళ కల్లు తాగిన మైకంలో తన పాపను రైల్వే పట్టాలపై పడుకోబెట్టగా.. స్థానికులు చూసి పాపను కాపాడారు. మహిళను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. కల్తీ కల్లు తాగి గతేడాది మహబూబ్‌నగర్‌లో ముగ్గురు, గతంలో గద్వాల జిల్లా మానవపాడులో ముగ్గురు, జడ్చర్ల మండలం ఆలూరులో ఇద్దరు చనిపోయారు. మత్తు కోసం నిషేధిత ఆల్ఫాజోలం లేదా డైజోఫాం లేదా సీహెచ్‌ను అధిక మోతాదులో వినియోగించడమే ఈ దారుణాలకు కారణం కాగా.. కల్లు మాఫియా ఈ విషయం వెలుగులోకి రాకుండా చక్రం తిప్పుతోంది. మహారాష్ట్రలోని ముంబై, పూణే, షోలాపూర్‌తో పాటు నాగపూర్, గుజరాత్ నుంచి కర్ణాటక మీదుగా అక్రమార్కులు ముఠాలుగా ఏర్పడి క్లోరల్ హైడ్రేట్ (సీహెచ్), ఆల్ఫాజోలంను దొంగచాటుగా రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది.

సీఎంఆర్ సేకరణ వేగవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ఆదర్శ్ సురభి.. హాజరైన అదనపు కలెక్టర్, అధికారులు

● కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: సీఎంఆర్ సేకరణ వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సీఎంఆర్‌పై సమీక్షించారు. మిల్లర్ల నుంచి రోజువారీగా సేకరించాల్సిన బియ్యం, ఇప్పటి వరకు సేకరించిన బియ్యం లెక్కలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. లక్ష్యానికి చాలా తక్కువగా బియ్యం ఇచ్చారని.. అందుకుగల కారణాలు తెలుసుకోవాలని సూచించారు. బియ్యం ఇవ్వని మిల్లుల్లో తనిఖీ చేయాలని.. వానాకాలం సీజన్‌లో ఇచ్చిన వరి ధాన్యం నిల్వలు ఉన్నాయా ? లేవా ? తనిఖీ చేయాలని లేకుంటే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. మిల్లుల తనిఖీలు రెండ్రోజుల్లో పూర్తిచేసి నివేదిక అందజేయాలని, బియ్యం ఇప్పించే బాధ్యత డిప్యూటీ తహసీల్దార్లు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

5వ తేదీన వరి కొనుగోలుపై జిల్లాస్థాయి సమావేశం..

ఈ నెల 5న వరి ధాన్యం కొనుగోళ్లపై పీఏసీఎస్, ఐకేపీ, మెప్మా కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, లారీ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులతో జిల్లాస్థాయి సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశానికి ఎంతమందిని పిలవాలో ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. వరి ధాన్యం దొడ్డు రకమా.. సన్న రకమా అనేది సాంకేతికంగా తెలుసుకోవడానికి డైల్ మైక్రోయంత్రాన్ని ప్రతి పీఏసీఎస్‌కు ఒకటి చొప్పున కొని వినియోగింపై శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఈసారి సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వనున్నందున గతంలో కంటే అధికంగా ధాన్యం కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నందున 300 వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సరిపడా గన్నీ బ్యాగులు, తేమ కొలిచే యంత్రాలు, తూకం వేసే యంత్రాలు, తాలు వేరు చేసేందుకు ఫ్యాన్లు సమకూర్చుకోవాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎం.నగేష్, డీఎస్‌ఓ కాశీవిశ్వనాథ్, డీఏఓ గోవింద్‌నాయక్, డీఎం మార్కెటింగ్ స్వరణ్‌సింగ్, జిల్లా కో–ఆపరేటివ్ అధికారి ప్రసాదరావు, జిల్లా తూనికలు, కొలతల అధికారి డి.సత్యనారాయణ, డీపీఎం అరుణ, డీఎం ఇర్ఫాన్, డీటీలు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

వనపర్తి రూరల్: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి కార్మిక చట్టాలు అమలు చేయాలంటూ సోమవారం వివిధ శాఖల్లో పనిచేసే కార్మికులు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని మర్రికుంట నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు పాల్గొని మాట్లాడుతూ.. జిల్లాకేంద్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో 500 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, నాన్ పర్మినెంట్ ఉద్యోగులు పని చేస్తున్నారని, కనీస వేతనాలు అమలు చేయకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలోని 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్‌లో కనీస వేతనాలు సవరించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలు అమలు చేస్తూ పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, గ్రాట్యూటీ ఇవ్వాలని కోరారు. అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలని, మహిళా కార్మికులకు రెస్ట్‌రూంలు, లైంగిక వేధింపులు అరికట్టాలన్నారు. జిల్లాకేంద్రంలో డీఎల్‌ఓ కార్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ నగేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, నాయకులు బొబ్బిలి నిక్సన్, రమేష్, రాములు, మద్దిలేటి, వెంకటేష్, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి 'దసరా' సీజన్

- రీజియన్ వ్యాప్తంగా 649 ప్రత్యేక సర్వీసులు
- నేటినుంచి ఈ నెల 11 వరకు నడవనున్న బస్సులు



మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు (ఫైల్)

స్టేషన్ మహబూబ్‌నగర్: దసరా పండుగను పురస్కరించుకొని మహబూబ్‌నగర్ రీజియన్‌లో 649 ఆర్టీసీ అదనపు బస్సు సర్వీసులు తిరగనున్నాయి. రీజియన్‌లోని పది డిపోల నుంచి ఈ ప్రత్యేక బస్సు సర్వీసులు మంగళవారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు నడపనున్నారు. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకొని మహబూబ్‌నగర్ రీజియన్‌లోని డిపోల నుంచి అదనపు సర్వీసులు నడపనున్నారు.

డిపో	అదనపు సర్వీసులు
అచ్చంపేట	105
వనపర్తి	95
గద్వాల	89
మహబూబ్‌నగర్	69
కల్వకుర్తి	67
షాద్‌నగర్	59
కొల్లాపూర్	58
నారాయణపేట	54
నాగర్‌కర్నూల్	53

అధికంగా 105 సర్వీసులు..

దసరా పండుగను పురస్కరించుకొని మహబూబ్‌నగర్ రీజియన్ వ్యాప్తంగా 649 అదనపు సర్వీసులు నడవనున్నాయి. గతేడాది కంటే ఈసారి దసరా పండుగ సందర్భంగా అధికంగా ప్రత్యేక బస్సులు నడపడానికి తగిన చర్యలు తీసుకుంటున్నారు. హైదరాబాద్ రూట్లో ఈ ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నారు. ఈ రూట్లోనే ఆర్టీసీకి అధిక ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అచ్చంపేట డిపో నుంచి 105 అధికంగా ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక బస్సులు..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పలు నగరాలు, పట్టణాలకు మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ మీదుగా విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి, అమలాపురం, కడపతోపాటు ఇతర ప్రధాన పట్టణాల వరకు సూపర్ లగ్జరీ బస్సులు నడపనున్నారు. ఈ మేరకు దాదాపు 16 బస్సులను అందుబాటులో ఉంచనున్నారు. ఓపీఆర్ఎస్ ప్రకారం (రిజర్వేషన్ బుకింగ్) ఈ ప్రత్యేక బస్సులను నడపడానికి చర్యలు తీసుకుంటున్నారు.

పెరగనున్న ఆదాయం..

దసరా పండుగ సందర్భంగా సాధారణ రోజుల కంటే రీజియన్‌కు కొద్దిమేర ఆదాయం పెరిగే అవకాశం ఉంది. పండుగ ప్రారంభ మూడు రోజులు, ముగింపు అనంతరం రెండు రోజుల్లో బస్సుల్లో ప్రయాణించేవారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. దీంతో ఆర్టీసీకి ఆదాయం పెరుగుతుందని భావిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..



దసరా పండుగను పురస్కరించుకొని ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడపనున్నాం. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి. అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయి. అక్టోబర్, నవంబర్ మాసాల్లో అధిక పెళ్లిళ్లు, శుభకార్యాలను దృష్టిలో ఉంచుకొని నిష్ణాతులైన డ్రైవర్‌చే బస్సులను నడిపిస్తాం. 10 శాతం రాయితీతో డిపాజిట్ లేకుండా ఆర్టీసీ అద్దె బస్సులను బుకింగ్ చేసుకోవచ్చు. మిగతా వివరాల కోసం అచ్చంపేట– 99592 26291, గద్వాల– 99592 26290, కల్వకుర్తి– 99592 26292, కొల్లాపూర్– 90004 05878, కోస్గి– 99592 26293, మహబూబ్‌నగర్– 99592 26286, నాగర్‌కర్నూల్– 99592 26288, నారాయణపేట– 99592 26293, షాద్‌నగర్– 99592 26287, వనపర్తి– 99592 26289లను సంప్రదించాలి.

– శ్రీదేవి, ఆర్టీసీ రీజినల్ మేనేజర్

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


నారాయణ(ఫైల్)

వీపనగండ్ల: మండలంలోని వల్లాభాపురంతండాకు చెందిన రైతు కాట్రావత్ నారాయణ (58) విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. గ్రామస్తుల కథనం మేరకు.. నారాయణ ఆదివారం తెల్లవారుజామున తండా నుంచి సంగినేనిపల్లికి కాలినడకన బయలుదేరాడు. సంగినేనిపల్లికి చెందిన రైతు గొల్ల పరమేష్ అడవి పందుల బెడద నివారణకు ఏర్పాటుచేసిన విద్యుత్ తీగలు కాలికి తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. నారాయణకు భార్య మంగమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఘటనా స్థలాన్ని వనపర్తి సీఐ నాగభూషణరావు పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సీఐ వెంట ఎస్ఐ రాణి, గోపాల్‌పేట ఎస్ఐ హరిప్రసాద్, ఆర్ఎస్ఐ సురేంద్ర తదితరులు ఉన్నారు.

విద్యుత్ వైర్ల వల్ల మృతి.. ఇద్దరిపై కేసు నమోదు


దేవేందర్(ఫైల్)

లింగాల: మండల కేంద్రానికి సమీపంలోని దారారం వెళ్లే మార్గంలో లభ్యమైన మృతదేహాన్ని లింగాలకు చెందిన ఆంగోతు దేవేందర్(21)గా గుర్తించినట్లు.. ఘటనకు సంబంధించి లింగస్వామి, శంకర్‌లపై కేసు నమోదు చేశామని అచ్చంపేట సీఐ రవీందర్ తెలిపారు. సోమవారం ఘటన స్థలాన్ని సీఐ పరిశీలించారు. గత నెల 29న ఓ వ్యవసాయ పొలంలో యువకుడు చనిపోయిన ఘటన వెలుగు చూసిందన్నారు. మృతదేహం పంట పొలాల గట్టు దగ్గర కనిపించినట్లు పేర్కొన్నారు. లింగాలకు చెందిన కంప లింగస్వామి, ఉలెన్ శంకర్ సాగు చేసిన మొక్కజొన్న పంటను అడవి పందుల నుంచి కాపాడుకునేందుకు నిబంధనలకు విరుద్ధంగా పొలం చుట్టూ విద్యుత్తు వైర్లను ఏర్పాటు చేసుకున్నారని.. కాగా మూడు రోజుల క్రితం అటుగా వెళ్తూ దేవేందర్ ప్రమాదవశాత్తు తీగలను తాకడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు వివరించారు. అతడి తల్లి సోని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు వివరించారు.

యువకుడి ఆత్మహత్య

మహమ్మదాబాద్: ఉరేసుకుని పొలం వద్ద యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. గండేడ్ మండలంలోని రుసుంపల్లి గ్రామానికి చెందిన వడ్డె అంజిలయ్య కుమారుడు వడ్డె శ్రీనివాస్ (20) వ్యవసాయ పనులు చేసేవాడు. సోమవారం పొలానికి వెళ్లాడు. పశువులకు నీళ్లు తాగించి పశువుల పాకలో కట్టేశాడు. సాయంత్రం 5 గంటల సమయంలో పొలం వద్దనే చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. శ్రీనివాస్ మృతితో కుటుంబీకుల రోధనలు మిన్నంటాయి.

బస్సులో వ్యక్తి హఠాన్మరణం

జడ్చర్ల టౌన్: హైదరాబాద్ నుంచి జిల్లా కేంద్రానికి బస్సులో వస్తున్న ఓ ప్రయాణికుడు గుండెపోటుతో మార్గమధ్యంలోనే మృతిచెందాడు. స్థానికుల వివరాల మేరకు.. హన్వాడ మండలం బుద్ధారం గ్రామానికి చెందిన కుక్కలి ఆంజనేయులు (45) హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్‌కు వచ్చేందుకు కర్ణాటక బస్సు ఎక్కాడు. జడ్చర్ల నియోజకవర్గం రాజాపూర్ సమీపంలో అతడు గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన ప్రయాణికులు సీపీఆర్ చేసినప్పటికీ అతడిలో ఎలాంటి చలనం లేకపోవడంతో బస్సులో నేరుగా జడ్చర్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

సెకండ్ ఇన్నింగ్స్



తోటి వృద్ధులకు అండగా నిలుస్తున్న సీనియర్ సిటిజన్ ఫోరం

నేడు ప్రపంచ వృద్ధుల దినోత్సవం

- సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ భాగస్వామ్యం
- రిటైర్డ్ ఉద్యోగులతో పాటు సామాన్యులు, వ్యాపారులకు ఫోరంలో సభ్యత్వం
- తల్లిదండ్రులను పట్టించుకోని కుమారులకు కౌన్సెలింగ్

జడ్చర్ల టౌన్: వారంతా అరవై పదుల వయసు దాటిన వారు. ఉద్యోగ, ఇతరత్రా బాధ్యతల విరమణ అనంతరం ఖాళీగా ఇంట్లో ఉండకుండా సమాజ సేవా కార్యక్రమాల్లో ముందుండి పనిచేస్తున్నారు. యువకులతో పోటీపడుతూ సమాజ హితమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు సీనియర్ సిటిజన్స్ ఫోరం సభ్యులు. మొదట మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో 2017లో 25 మందితో ఫోరం ప్రారంభమైంది. ఆ తర్వాత జడ్చర్ల, హన్వాడ, నవాబుపేట, దేవరకద్రలో సీనియర్ సిటిజన్ ఫోరంలు ఏర్పాటయ్యాయి. భవిష్యత్‌లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సేవలు అందించేందుకు ఫోరం కృషి చేస్తోంది. జడ్చర్లలో 45 మందితో ప్రారంభమైన ఫోరంలో ప్రస్తుతం 450 మంది సభ్యులుగా ఉన్నారు.

ప్రజావాణితో మొదలు..

మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి వచ్చే ప్రజలకు దరఖాస్తు రాసిచ్చే వారు రూ. 50 నుంచి రూ. 100 వసూలు చేయడాన్ని గుర్తించిన సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు.. ప్రజలకు ఉచితంగా దరఖాస్తు రాసివ్వాలని నిర్ణయించుకున్నారు. అక్కడి నుంచే ఫోరం సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రజలకు దరఖాస్తులు రాసివ్వడంతో పాటు వృద్ధులను స్వయంగా అధికారుల వద్దకు తీసుకెళ్లి సమస్యపై విన్నవిస్తున్నారు. తల్లిదండ్రులను పట్టించుకోని వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఫోరం కౌన్సెలింగ్‌తో అనేక కుటుంబాలు సంతోషంగా గడుపుతున్నాయి. ముఖ్యంగా ఆర్డీఓ ట్రిబ్యునల్‌లో 8 కేసులు పరిష్కారమయ్యేందుకు ఫోరం ఎంతో కృషి చేసిందనే చెప్పాలి. దీనికి తోడు పాఠశాలల్లో విద్యార్థులకు తల్లిదండ్రుల విలువలను తెలియజేస్తూ.. పెద్దలతో గౌరవంగా మెలిగేలా తీర్చిదిద్దుతున్నారు.

⇨ నవాబుపేట మండలం యన్మన్‌గండ్లకు చెందిన వృద్ధురాలు కొల్లూరు మైసమ్మను కొడుకు, కోడలు నిర్లక్ష్యం చూస్తుండటంతో తన కూతురు వద్ద కొన్ని రోజులపాటు కాలం గడిపింది. వితంతురాలైన తన కూతురికి తాను భారం కావొద్దని వయోవృద్ధుల కేంద్రాన్ని సంప్రదించింది. దీంతో ఆశాఖ జిల్లా సంక్షేమ అధికారిగా ఉన్న జరీనాబేగం ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి నాగరాజును క్షేత్రస్థాయి విచారణ జరిపించాలని ఆదేశించింది. విచారణలో సీనియర్ సిటిజన్ ఫోరం కుమారుడికి కౌన్సెలింగ్ ఇచ్చి, ప్రతినెలా తల్లి పోషణార్థం రూ. 3 వేలు ఇప్పించేలా అంగీకరింపజేశారు. వృద్ధులకు ఏమైనా సమస్యలు ఉంటే వయోవృద్ధుల కేంద్రం 14567 నంబర్‌ను సంప్రదించాలని సూచిస్తున్నారు.


తల్లిని పట్టించుకోని కుమారుడికి కౌన్సెలింగ్ ఇస్తున్న ఫోరం సభ్యులు, అధికారులు (ఫైల్)

జిల్లాలో సీనియర్ సిటిజన్ ఫోరాల వివరాలిలా..

ప్రాంతం	సభ్యులు
మహబూబ్‌నగర్	250
జడ్చర్ల	450
నవాబుపేట	230
హన్వాడ	50
దేవరకద్ర	15

ఇవి సేవా కార్యక్రమాలు..

⇨ పేద, ధనిక వ్యత్యాసం లేకుండా 60 ఏళ్లు దాటిన వారికి ఆరోగ్య సలహాలు అందిస్తూ.. వారిలో నూతనోత్సాహం నింపుతున్నారు.

⇨ తల్లిదండ్రులను ఓల్డేజ్ హోంలో వదిలేసే పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చి, తరచూ తల్లిదండ్రులతో గడిపేలా చూస్తున్నారు.

⇨ ఫోరం సభ్యులందరూ నెలలో మూడు పర్యాయాలు సమావేశమై సరదాగా గడుపుతున్నారు.

⇨ ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్సకు వచ్చే వారికి త్వరగా డాక్టర్లు పరీక్షించేలా చూస్తున్నారు.

⇨ రైల్వేస్టేషన్, బస్టాండ్లు, ఇతర ప్రాంతాల్లో ఉండే అనాథలు, యాచకులకు దుప్పట్లు, భోజనం అందిస్తూ వస్తున్నారు.

⇨ సదరన్ క్యాంప్‌లకు వచ్చే వారికి భోజనం అందించడం, స్వగ్రామాలకు వెళ్లేందుకు రవాణా ఖర్చులు చెల్లిస్తున్నారు.

⇨ బాలభవన్‌లో బాలలకు దుప్పట్ల పంపిణీతో పాటు కేరళ వరద బాధితులకు రూ. 50 వేలు, పుల్వామా దాడిలో అమరులైన జవాన్లకు సహాయంగా రూ. లక్ష విరాళం అందజేశారు.

వృద్ధులకు అండగా ఉంటున్నాం..



2017లో 25మంది సభ్యులతో ప్రారంభమైన ఫోరం ప్రస్తుతం 252 మందితో కొనసాగుతుంది. వృద్ధులకు ఏదేని సమస్య వస్తే వెంటనే వారికి అవసరమైన సలహాలు అందించడం, పరిష్కారానికి ప్రయత్నిస్తున్నాం. ఒంటరిగా ఉన్న వృద్ధులకు అండగా ఉంటామని భరోసా కల్పిస్తున్నాం.

– జగపతిరావు, అధ్యక్షుడు, సీనియర్ సిటిజన్ ఫోరం, మహబూబ్‌నగర్

వయసుకే వృద్ధాప్యం..



వృద్ధాప్యం అనేది నంబర్లలో చెప్పుకోటానికి మాత్రమే.. మనసుకు కాదు. 450 మందితో ఉన్న మా ఫోరంలో పనిచేస్తుంటే ఎంతో ఉత్సాహంగా అనిపిస్తుంది. మా అందరి లక్ష్యం ఒక్కటే వృద్ధులెవరూ ఇబ్బందులు కలగకూడదని. 60 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరి ఆరోగ్యం బాగుండాలని ఆరోగ్య కమిటీని ఏర్పాటు చేసుకొని సేవలు అందించాలని నిర్ణయించుకున్నాం.

– శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శి, సీనియర్ సిటిజన్స్ ఫోరం, జడ్చర్ల

నన్ను అధికారులే చంపేశారు..

- పురుగు మందు డబ్బాతో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బాధితుడి ఆందోళన


పురుగు మందు డబ్బాతో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న హన్మంతు, కుటుంబ సభ్యులు

కృష్ణా: మండల పరిషత్ కార్యాలయం ఎదుట అన్నపోళ్ల హన్మంతు కుటుంబ సభ్యులు సోమవారం పురుగు మందు డబ్బాతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ వికలాంగుల పింఛన్ కోసం అప్పటి పంచాయతీ కార్యదర్శికి 2019లో రూ.10 వేలు ఇచ్చి మంజూరు చేసుకుంటే.. 2019 మార్చిలోనే తాను చనిపోయినట్లు కంప్యూటర్‌లో నమోదు చేశారని ఆరోపించారు. అప్పటి నుంచి తనకు వచ్చే రేషన్ బియ్యంతోపాటు బ్యాంక్ అకౌంట్, కరెంట్ బిల్లు ఇలా ప్రతి విషయంలోనూ తాను చనిపోయినట్లు వస్తుండటంతో భరించలేకపోతున్నానని, బతికి ఉండగానే అధికారులు నన్ను చంపేశారని వాపోయాడు. తనకు న్యాయం చేయాలని, లేకపోతే ఆత్మహత్య చేసుకోడానికైనా అవకాశం ఇవ్వాలని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై స్పందించిన ఎంపీడీఓ జానయ్య మాట్లాడుతూ సమస్యను తక్షణమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే పంచాయతీ కార్యదర్శికి ఇచ్చిన రూ.10 వేలను సైతం తిరిగి ఇప్పిస్తానని చెప్పడంతో ఆందోళన విరమించారు.


పాఠశాల గేటుకు తాళం వేస్తున్న యజమాని


బయట నిల్చున్న ఉపాధ్యాయులు

పాఠశాలకు తాళం

ఎర్రవల్లి: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల భవనానికి సోమవారం యజమాని తాళం వేశాడు. వివరాల్లోకి వెళ్తే.. ఎర్రవల్లికి చెందిన ఎంజీ కృష్ణ తన మూడంతస్తుల భవనాన్ని నెలకు రూ. 1,29,900 అద్దెకు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల (అయిజ)కు అద్దెకు ఇచ్చారు. 9 నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో బ్యాంకుల్లో కిస్తులు చెల్లించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పాఠశాలలోకి ఉపాధ్యాయులు వెళ్లకుండా గేటుకు తాళం వేశారు. దీంతో ఉపాధ్యాయులు చాలా సమయం బయటనే ఉండాల్సి వచ్చింది. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రామాంజనేయులు ఫోన్‌లో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు యజమానితో మాట్లాడి త్వరలోనే చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో తెరిచారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కార్డెన్‌సెర్చ్


కార్డెన్‌సెర్చ్‌లో మాట్లాడుతున్న సీఐ నాగేశ్వర్ రెడ్డి

మల్దకల్: శాంతిభద్రతల పరిరక్షణకు కార్డెన్‌సెర్చ్ నిర్వహిస్తున్నామని..ప్రజలందరూ సహకరించాలని గద్వాల సీఐ నాగేశ్వర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. సోమవారం రాత్రి మండలంలోని మద్దెలబండలో ఎస్ఐ నందికర్ ఆధ్వర్యంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటిని తనిఖీ చేస్తూ వారి గుర్తింపు కార్డులను పరిశీలించారు. గ్రామంలో సరైన పత్రాలు లేని వాహనాలను పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అలాగే శాంతిభద్రతలు, మాదక ద్రవ్యాలు, డ్రగ్స్, గంజాయి వంటి నివారణ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్ఐలు కళ్యాణ్‌రావు, షకూర్, మల్లేష్, ట్రాఫిక్ ఎస్సై బాలచంద్రుడు, ఏఎస్సై ఈశ్వరయ్య, పుల్లన్న, హెడ్‌కానిస్టేబుల్ పూజయ్య, హుసేన్, తిమ్మప్ప, పోలీసు సిబ్బంది ఉన్నారు.

రుణమాఫీ కోసం రోడ్డెక్కిన రైతులు


పెంట్లవెల్లిలో ధర్నా చేస్తున్న రైతులు

పెంట్లవెల్లి: పంట రుణాల మాఫీ కోసం రైతులు రోడ్డెక్కారు. పెంట్లవెల్లి సింగిల్‌విండో కార్యాలయంలో సోమవారం మహాజన సభ నిర్వహిస్తుండగా.. రైతులు ఒక్కసారిగా అక్కడికి చేరుకొని ఆందోళనకు దిగారు. కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. రైతుల ఆందోళనకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు, సింగిల్‌విండో చైర్మన్ విజయరామారావు, సురేందర్‌గౌడ్ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెంట్లవెల్లి సహకార బ్యాంకులో పంట రుణాలు తీసుకున్న రైతులకు కనీసం రూ. లక్ష కూడా మాఫీ కాలేదన్నారు. మొత్తం 499 మంది రైతులు దాదాపు రూ. 3.26 కోట్ల రుణాలు తీసుకున్నారని.. ఏ ఒక్క రైతు కూడా రుణమాఫీకి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

అత్తారింటికి వెళ్తూ.. రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గట్టు: మరి కొద్దిసేపట్లో అత్తారింటికి చేరుకుంటున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై చిన్న(30) అనే యువకుడు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా, మాన్వి తాలుకా, కురిడి క్రాస్ రోడ్డుకు చెందిన చిన్నాకు తాటికుంటకు చెందిన శాంతికి మూడేళ్ల క్రితం వివాహమైంది. చిన్న బెంగళూరులో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బెంగళూరు నుంచి నేరుగా స్వగ్రామం కురిడి క్రాస్ రోడ్డుకు చేరుకుని, అక్కడి నుంచి ద్విచక్రవాహనంపై అత్తారిల్లు తాటికుంటకు బయలు దేరాడు. గట్టు మీదుగా గొర్లఖాన్‌దొడ్డి, తప్పెట్లమొర్సు మీదుగా తాటికుంటకు వెళ్తున్న సమయంలోనే.. రాజోలికి చెందిన ఓ వ్యక్తి అత్తారిల్లు గొర్లఖాన్‌దొడ్డికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. కాగా గొర్లఖాన్‌దొడ్డి, తప్పెట్లమొర్సు మధ్య ఎదురెదురుగా వారి ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. దీంతో తీవ్రంగా గాయపడ్డ చిన్నాను గద్వాల ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున అతడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

119 మంది యోగా శిక్షకుల ఎంపిక



పాలమూరు: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆయూష్ విభాగంలో ఖాళీ ఉన్న యోగా శిక్షకుల పోస్టులు భర్తీ కోసం సోమవారం జిల్లాకేంద్రంలోని ఆయూష్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 130 మంది అభ్యర్థులు హాజరు కాగా.. ఇందులో 119మందిని ఎంపిక చేశారు. వీరు యోగా శిక్షకులు ప్రత్యేక తరగతులు ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కో తరగతి నిర్వహణకు వారికి వేతనం చెల్లించనున్నారు. ఆయూష్ శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ రవినాయక్, జిల్లా ఇన్‌చార్జి ఆదిశేషయ్య, సీనియర్ మెడికల్ ఆఫీసర్లు చంద్రశేఖర్, ఫయీమ్, రాజేందర్, సురేష్ నాయక్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో 'పేట' కలెక్టర్ బస


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కలెక్టర్ సిక్తా పట్నాయక్ సోమవారం రాత్రి బస చేశారు. రాత్రి 7.45 గంటల ప్రాంతంలో పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వసతి సదుపాయాలను, నిత్యావసర సరుకుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి రాత్రి భోజనం చేశారు. అనంతరం అదే పాఠశాల ఆవరణలో ఉన్న కస్తూర్బా విద్యాలయాన్ని తనిఖీ చేసి విద్యార్థినులను పలు ప్రశ్నలు అడిగి వారి విద్యా సామర్థ్యాన్ని పరిశీలించారు. భవిష్యత్తులో ఏం అవుతారని అడగగా.. ఎక్కువ సంఖ్యలో ఐపీఎస్, డాక్టర్, ఇంజినీర్ అవుతామని చెప్పగా.. కలెక్టర్ ఎవరూ కారా? ఈ జిల్లా నుంచి ఇద్దరు కలెక్టర్లు(ఐఏఎస్‌లు) ఉన్నారని ఆమె విద్యార్థులకు తెలిపారు. లక్ష్మి అనే విద్యార్థిది పుట్టినరోజు కావడంతో శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థినులు పాటలు పాడగా వారిని అభినందించారు. కస్తూర్బా విద్యాలయానికి బోరు అవసరమని ఎస్ఓ కలెక్టర్‌ను కోరగా.. ఆమె సానుకూలంగా స్పందించారు. అనంతరం కలెక్టర్ తిరిగి గురుకుల పాఠశాలకు చేరుకుని విద్యార్థుల స్టడీ అవర్‌ను, చదువు తీరును పర్యవేక్షించారు. మిగతా తరగతి గదులకు వెళ్లి భారతదేశం, తెలంగాణ రాష్ట్రం, జిల్లా, పుట్టిన ఊరు, చదివే పాఠశాల పది వాక్యాల ఉపన్యాసం చెప్పాలని విద్యార్థినులకు సూచించారు. అలాగే, పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. పాఠశాలలో ఇంటర్ విద్యార్థినులు చేస్తున్న డ్యాన్స్ రిహార్సల్స్‌ను చూసి వారిని మెచ్చుకున్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి గురుకుల పాఠశాలలోనే కలెక్టర్ నిద్రించారు.

పట్టపగలే చోరీ



కేటీదొడ్డి: పట్టపగలే చోరీ జరిగిన సంఘటన కేటీదొడ్డి మండలంలోని ఎర్సందొడ్డిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. ఎర్సందొడ్డిలో రైతులు పొలం పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు నాలుగు ఇళ్లలో చోరీ చేశారు. పనులు ముగించుకుని ఇళ్లకు వచ్చిన బాధితుల ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటం గమనించారు. మొత్తం రూ.1,63,000 విలువ చేసే బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, క్లూస్‌టీం ద్వారా వేల ముద్రలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరు దొంగలు రిమాండ్‌కు..

జడ్చర్ల: పట్టణంలో జరిగిన మూడు చోరీల్లో ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఎర్రగుట్టకు చెందిన చిట్యాల రవి, వెంకటేశ్వరకాలనీకి చెందిన లింగాల మహేశ్ ఆటోడ్రైవర్లుగా పని చేస్తున్నారు. వీరిద్దరూ పగలు రెక్కీ నిర్వహించి రాత్రిళ్లు తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలకు పాల్పడ్డారు. జులై 30న భవానీనగర్‌లో వడ్ల గోపి ఇంటిలో 3 గ్రాముల ఉంగరం, 4 గ్రాముల కమ్మలు.. ఆగస్టు 19న ఇంపీరియల్ గార్డెన్స్ సమీపంలోని నరేంద్ర సాగర్ ఇంట్లో 3 గ్రాముల ఉంగరం, రూ.15 వేల నగదు .. ఈ నెల 14న తాలుకా క్లబ్ ఏరియాలోని అసన్ అలీఖాన్ ఇంటిలో 1.25 తులాల బంగారు నెక్లెస్, 7 గ్రాముల బంగారు కమ్మలు, 5 గ్రాముల రెండు ఉంగరాలు ఎత్తుకెళ్లారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని నిందితుల నుంచి చోరీ సొత్తు రికవరీ చేశామని, నగదును ఖర్చు చేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు. కాగా చిట్యాల రవిపై జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో 11 కేసులు ఉన్నట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ శివానందంగౌడ్ పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఆదిరెడ్డి

హత్యాయత్నం కేసులో నిందితుడికి నాలుగేళ్ల జైలు

పాన్‌గల్: హత్యాయత్నం కేసులో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడికి నాలుగేళ్ల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్ఐ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని కేతేపల్లిలో నాసాల్ల శేఖర్, గాలిగళ్ల మైబూసమ్మ ఇంటి ముందు పారే మురుగు విషయమై తరచూ ఘర్షణ పడేవారు. ఫిబ్రవరి 1న జరిగిన గొడవలో నాసాల్ల శేఖర్ గొడ్డలితో మైబూసమ్మ తలపై, అడ్డుకోబోయిన ఆమె భర్త మునుస్వామిపై దాడి చేయగా గాయాల పాలయ్యారు. బాధితుడు మునుస్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు శేఖర్‌పై కేసునమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి జిల్లాకేంద్రంలోని సీనియర్ సివిల్‌కోర్టులో కేసు నడుస్తోంది. సోమవారం అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీందర్, చిన్నారెడ్డి, పీసీ స్వామి 12 సాక్షులను న్యాయమూర్తి రజని ముందు హాజరుపర్చారు. నేరం రుజువు కావడంతో నాలుగేళ్ల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐ వివరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు విధులు నిర్వహిస్తున్న పీసీ స్వామిని ఎస్పీ గిరిధర్ అభినందించారు.

మృతదేహాలు లభ్యం

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు శివారులో సోమవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. జాతీయ రహదారి పక్కనే ఉన్న పుల్లూరు శివారులోని ఎర్రమట్టి పొలంలో కుళ్లిపోయిన గుర్తు తెలియని శవాన్ని పోలీసులు గుర్తించారు. మృతదేహం నెలకు పైగా అక్కడే పడి ఉండవచ్చని, తలకాయ, శరీర అవయవాలు మొత్తం కుళ్లిపోయినట్లు కాళ్ల వద్ద రెండు ప్యాంట్లు నలుపు, బ్రౌన్ కలర్‌వి, బ్లూ కలర్ షర్ట్, నలుపు ఎరుపు రంగు పూసలదండ ధరించి ఉన్నాడు. అలంపూర్ మార్చురీకి మృతదేహం తరలించినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో..

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ క్రాస్‌రోడ్డు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి (50) మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ గోవర్ధన్ సోమవారం తెలిపారు. కొల్లాపూర్ క్రాస్‌రోడ్ సమీపంలో దాబా వద్ద వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

మరిన్ని ఏపీ వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం

ఒంటరి పెద్దలకు పెళ్లి.. మనమే చేద్దాం మళ్లీ..

■ పంజగుట్టకు చెందిన సత్యనారాయణకు ముగ్గురు కూతుళ్లు. భార్య కేన్సర్‌తో చనిపోగా కూతుళ్లను పెంచి పెద్దచేసి పెళ్లిళ్లు చేశారు. కూతుళ్లు ఇంట్లో ఉన్నంతకాలం ఒంటరితనం అంటే ఏమిటో తెలియని ఆయన.. వారంతా అత్తారిళ్లకు వెళ్లిపోయాక కొన్ని నెలల్లోనే మానసికంగా కుంగిపోయారు. తండ్రి పరిస్థితి చూసి తల్లడిల్లిన కూతుళ్లు.. తండ్రికి తగ్గ జోడీని తెచ్చి పెళ్లి చేశారు. ఇప్పుడు సత్యనారాయణ భార్యతో కలిసి హాయిగా శేషజీవితం వెళ్లదీస్తున్నారు.

■ అమెరికాలో నివసించే ఓ వివాహిత హైదరాబాద్‌లో ఉండే తన సోదరుడు చనిపోయాక ఒంటరిగా ఉండలేకపోతున్న తల్లి కష్టాలు చూసి చలించిపోయింది. వెంటనే నగరానికి వచ్చి దగ్గర బంధువులతో మాట్లాడటంతోపాటు ఎలాగోలా తల్లిని ఒప్పించి మరో పెళ్లి చేసింది. వారికి కావాల్సినవన్నీ సిద్ధం చేసి మళ్లీ అమెరికా వెళ్లిపోయింది.

ఈ రెండు ఉదంతాలు నవతరం పిల్లల ఆలోచనా ధోరణికి అద్దం పడుతున్నాయి. ఉమ్మడి కుటుంబాలను దెబ్బతీసిన న్యూక్లియర్ ఫ్యామిలీస్ ఆ తర్వాత సీనియర్ సిటిజన్స్‌కు వృద్ధాశ్రమాలనే మలి మజిలీలుగా మార్చాయి. అయితే ఇటీవల ఆ తరహా ఆలోచనల నుంచి ఇతరత్రా పరిష్కారాలను వెదుకుతున్నారు.. అందులో భాగంగానే పెద్దల పెళ్లిళ్లు ఊపందుకుంటున్నాయి. ఈ ట్రెండ్ అనేక మంది ఒంటరి తల్లులకు జంటను తెచ్చిపెడుతోంది. తండ్రికి మళ్లీ పెళ్లి చేయడం ద్వారా ఆయన బాగోగులు దగ్గరుండి చూసుకోలేకపోతున్నామనే గిల్టీనెస్ పోగొట్టుకోవడంతోపాటు మరో ఒంటరి మహిళకు తోడు అందించామనే తృప్తి కూడా పొందుతున్నామని సత్యనారాయణ కుమార్తెలు 'సాక్షి'కి చెప్పారు.



వృద్ధాప్యంలో శాపంగా మారే ఒంటరితనానికి పెళ్లి/లివిన్ మించిన పరిష్కారమార్గం లేదని అర్థం చేసుకొని 14 ఏళ్ల క్రితం మా సంస్థను ప్రారంభించాం. ఇప్పటివరకు మేము కొన్ని వేల మంది ఒంటరి వృద్ధుల జీవితాల్లో తిరిగి ఆనందాన్ని తీసుకురాగలిగామని గర్వంగా చెప్పగలను.

\- రాజేశ్వరి, తోడు-నీడ సీనియర్ సిటిజన్స్ సేవా సంస్థ

ఎలాంటి ఆధారాల్లేవ్



చంద్రబాబు 'కొవ్వు' ప్రకటనపై సుప్రీంకోర్టు ఆగ్రహం

లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు ఉందని సీఎం ఎలా చెబుతారు?

సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో వినియోగించే నెయ్యిలో కల్తీ ఆరోపణల విషయంలో వాస్తవాలు నిర్ధారణ కాక ముందే కల్తీ జరిగినట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజకీయ ప్రకటనలు చేయడాన్ని సుప్రీం కోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. లడ్డూ తయారీకి ఉపయోగించిన నెయ్యిలో జంతు కొవ్వు ఉందని చెప్పేందుకు ముఖ్యమంత్రి వద్ద ఏం ఆధారాలున్నాయని సూటిగా ప్రశ్నించింది. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న ముఖ్యమంత్రి ప్రెస్ ముందు అలా ఎలా మాట్లాడతారని నిలదీసింది. ప్రమాణాలకు అనుగుణంగా లేని నెయ్యిని వెనక్కి పంపించేశామని, అసలు ఆ నెయ్యిని లడ్డూ తయారీలో వాడనే లేదని టీటీడీ ఈవో చాలా స్పష్టంగా చెప్పారని గుర్తు చేసింది. మరి అందుకు విరుద్ధంగా లడ్డూలో కల్తీ నెయ్యి ఉపయోగించారని ముఖ్యమంత్రి రాజకీయ ప్రకటనలు ఎలా చేస్తారని విస్మయం వ్యక్తం చేసింది. అసలు దేని ఆధారంగా నెయ్యి కల్తీ అయినట్లు చెబుతున్నారు? లడ్డూలో కల్తీ నెయ్యి ఉపయోగించారనేందుకు ఆధారాలు ఏమిటి? అని ప్రశ్నించింది. శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించారనేందుకు ప్రాథమిక ఆధారాలు లేవని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఒకవైపు దర్యాప్తు కొనసాగుతుండగా మరోవైపు రాజ్యాంగపరమైన ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులు రాజకీయ ప్రకటనలు చేయడం సరికాదని స్పష్టం చేసింది. అలాంటి ప్రకటనలు చేయడం వల్ల కోట్ల మంది ప్రజల మనోభావాలు ప్రభావితం అవుతాయని తేల్చి చెప్పింది. 'కనీసం దేవుడినైనా రాజకీయాలకు దూరంగా ఉంచండి..!' అని సీఎం చంద్రబాబు తదితరులను దృష్టిలో పెట్టుకుని ఘాటుగా వ్యాఖ్యానించింది. నెయ్యి కల్తీ జరిగిందంటూ రిపోర్టు ఇచ్చిన నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌డీడీబీ) తన నివేదిక తప్పు కావొచ్చునని స్పష్టంగా పేర్కొందని ప్రస్తావించింది. నెయ్యి కల్తీ జరిగిందన్న విషయం ప్రజల్లోకి వెళ్లింది గానీ తన నివేదికలో తప్పులు ఉండవచ్చని ఎన్‌డీడీబీ స్వయంగా చెప్పిన విషయం మాత్రం ప్రజల్లోకి వెళ్లే పరిస్థితి లేదని వ్యాఖ్యానించింది. కల్తీపై ఎన్‌డీడీబీ ఇచ్చిన నివేదికపై సెకండ్ ఒపీనియన్ (రెండో అభిప్రాయం) ఎందుకు తీసుకోలేదని టీటీడీని ప్రశ్నించింది. ఎన్‌డీడీబీ ఒక్కటే అత్యున్నత ల్యాబ్ కాదని, దేశంలో పేరు మోసిన ల్యాబ్‌లు ఎన్నో ఉన్నాయని టీటీడీకి గుర్తు చేసింది. ఎన్‌డీడీబీ నివేదికలో స్పష్టత లోపించిందని పేర్కొంది. నెయ్యి కల్తీ వ్యవహారంపై దర్యాప్తు జరగాల్సిందేనని సుప్రీంకోర్టు ప్రాథమికంగా అభిప్రాయపడింది. అయితే దర్యాప్తు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) కొనసాగించాలా? లేక స్వతంత్ర సంస్థ ద్వారా దర్యాప్తు చేయాలా? అనే విషయంపై తమకు సహకరించాలని సొలిసిటర్ జనరల్ (ఎస్‌జీ) తుషార్ మెహతాను సుప్రీంకోర్టు ఆదేశించింది. దీనిపై తదుపరి విచారణను అక్టోబర్ 3కి వాయిదా వేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. నెయ్యి కల్తీకి సంబంధించి ప్రకటనలు చేసే విషయంలో నియంత్రణ పాటించేలా మీ క్లయింట్‌లకు (రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ ఈవో) చెప్పాలని టీటీడీ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రాకి ధర్మాసనం స్పష్టం చేసింది.

మా ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పండి..

తమ ప్రశ్నలకు లూథ్రా సూటిగా సమాధానం చెప్పకుండా దాటవేస్తుండటంతో ధర్మాసనం జోక్యం చేసుకుంది. తమ ప్రశ్నలకు ముందుగా సమాధానం చెప్పాలని ఆదేశించింది. 'లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి ఉపయోగించారనేందుకు ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేవు. ముఖ్యమంత్రి ప్రకటనకు విరుద్ధంగా టీటీడీ ఈవో ప్రకటన ఉంది. కల్తీ నెయ్యి విషయంలో మీ (టీటీడీ) వైఖరి చాలా స్పష్టంగా ఉంది. ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలకు ఎలాంటి ఆధారాల్లేవ్. దర్యాప్తునకు ఆదేశించినప్పుడు పదాల గారడీ ఎంత మాత్రం అవసరం లేదు...' అని ధర్మాసనం ఘాటుగా స్పష్టం చేసింది. సిట్ దర్యాప్తునకు ముందే ముఖ్యమంత్రి ప్రకటనలు చేశారని లూథ్రా తెలిపారు. సిట్ ఏర్పాటు తరువాత మాట్లాడలేదన్నారు. అసలు ఎంత మంది కాంట్రాక్టర్ల నుంచి నెయ్యిని సేకరిస్తున్నారని ధర్మాసనం ప్రశ్నించింది. ఐదుగురు కాంట్రాక్టర్ల వద్ద నుంచని లూథ్రా పేర్కొనడంతో.. వారి నుంచి సేకరించిన నెయ్యి మొత్తాన్ని కలిపేస్తారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. కలిపేస్తామని లూథ్రా బదులివ్వడంతో మరి ఎవరు సరఫరా చేసిన నెయ్యి కల్తీ అయిందో ఎలా నిర్ధారిస్తారని ధర్మాసనం ప్రశ్నించింది. మొత్తం నెయ్యి నుంచి కల్తీ నెయ్యిని ఎలా వేరు చేస్తారని ప్రశ్నించింది. దీనికి లూథ్రా నేరుగా సమాధానం ఇవ్వకుండా.. గత 50 ఏళ్లుగా స్వామి ప్రసాదాల కోసం కర్ణాటక ప్రభుత్వానికి చెందిన నందిని నెయ్యిని ఉపయోగిస్తూ వచ్చామని, గత ప్రభుత్వ హయాంలోనే కాంట్రాక్టర్ మారారని పేర్కొన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదు వచ్చిన నేపథ్యంలోనే నెయ్యి నాణ్యతను పరిశీలించామన్నారు. దీంతో కల్తీ వ్యవహారం బయటపడిందన్నారు. అయితే ఎన్‌డీడీబీ నివేదికలో అది తప్పు అయ్యే అవకాశం కూడా ఉందని స్పష్టంగా పేర్కొన్నారని, అలాంటప్పుడు సెకండ్ ఒపీనియన్ ఎందుకు తీసుకోలేదని ధర్మాసనం ప్రశ్నించింది. ఎన్‌డీడీబీ చాలా పేరున్న ల్యాబ్ అని లూథ్రా చెప్పగా.. అది ఒక్కటే కాదని, దేశంలో పేరు మోసిన ల్యాబ్‌లు చాలానే ఉన్నాయని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సిట్ ఏర్పాటు చేసిన నేపథ్యంలో దానినే కొనసాగించాలా? లేక దర్యాప్తును స్వతంత్ర సంస్థకు అప్పగించాలా? అనే విషయంపై చెప్పాలని కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ (ఎస్‌జీ) తుషార్ మెహతాను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది. తదుపరి విచారణ అక్టోబర్ 3న మధ్యాహ్నం 3.30 గంటలకు చేపట్టనున్నట్లు ప్రకటించింది.

పలు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు...

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూ తయారీకి ఉపయోగించే నెయ్యిలో జంతు కొవ్వులను కలిపారన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపణలపై వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఓ కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ సీనియర్ నేత, ప్రముఖ ఆర్థికవేత డాక్టర్ సుబ్రమణియన్ స్వామి ఇటీవల సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. అలాగే లడ్డూ నెయ్యి కల్తీ వ్యవహారంలో దర్యాప్తు, స్వతంత్ర విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తిని నియమించాలని అభ్యర్థిస్తూ రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి కూడా పిల్ దాఖలు చేశారు. ఇదే అంశంపై ఇతర రాష్ట్రాలకు చెందిన సంపత్, శ్రీధర్, సురేష్ చవంకే వేర్వేరుగా రెండు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నాలుగు వ్యాజ్యాలపై జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం మధ్యాహ్నం విచారణ జరిపింది. పిటిషనర్ సుబ్రమణియన్ స్వామి తరఫున సీనియర్ న్యాయవాది రాజశేఖర్‌రావు, సంపత్, శ్రీధర్ తరఫున రాఘవ్ అవస్థీ, సురేష్ చవంకే తరఫున సీనియర్ న్యాయవాది సోనియా మాథుర్, ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, టీటీడీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా వాదనలు వినిపించారు.

బాబు ప్రకటనతో నిష్పాక్షిక దర్యాప్తు సాధ్యమేనా?

ముందుగా రాజశేఖర్ రావు వాదనలు వినిపిస్తూ.. 'తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ జరిగిందని సీఎం చంద్రబాబు రాజకీయ ప్రకటన చేశారు. అయితే టీటీడీ ఈవో ఆ నెయ్యిని అసలు లడ్డూ తయారీలో ఉపయోగించలేదని పత్రికా ముఖంగా చెప్పారు. బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్న ముఖ్యమంత్రి లాంటి వ్యక్తులు ఎలాంటి ఆధారాలు లేకుండా, వాస్తవాలు తెలుసుకోకుండా ప్రకటనలు చేస్తే దాని పర్యవసానాలు దారుణంగా ఉంటాయి. అవి ప్రజల మధ్య సామరస్యాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. సీఎం ప్రకటనకు భిన్నంగా టీటీడీ ఈవో ప్రకటనలు ఉన్న నేపథ్యంలో ఈ వ్యవహారంపై పర్యవేక్షణతో కూడిన విచారణ అవసరం. ముఖ్యమంత్రి ప్రకటన నేపథ్యంలో దర్యాప్తు నిష్పాక్షిక, పారదర్శక దర్యాప్తు సాధ్యమేనా? ఈ మొత్తం వ్యవహారంలో రాజకీయ జోక్యాన్ని నిలువరించాలి. మా వ్యాజ్యంలో పలు కీలక ప్రశ్నలను వ్యక్తం చేశాం' అని నివేదించారు.

ఆ వ్యాజ్యానికి విశ్వసనీయత లేదు...

అనంతరం ఏపీ ప్రభుత్వం తరఫున ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ.. సుబ్రమణియన్ స్వామి దాఖలు చేసిన ఈ వ్యాజ్యానికి విశ్వసనీయత లేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని సమర్థించేందుకే ఆయన ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారన్నారు. స్వామి, వైవీ సుబ్బారెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాల్లోని అంశాలు ఒకే రకంగా ఉన్నాయన్నారు. నెయ్యి సరఫరాదారులకు టీటీడీ షోకాజ్ నోటీసులు జారీ చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించి దర్యాప్తు చేస్తోందని తెలిపారు. అనంతరం టీటీడీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ కల్తీ నెయ్యిని పరీక్షల నిమిత్తం ప్రఖ్యాత ఎన్‌డీడీబీ ల్యాబ్‌కు పంపామన్నారు. జూన్ నుంచి జూలై 4 వరకు సరఫరా చేసిన నెయ్యి శాంపిళ్లను ఎన్‌డీడీబీకి పంపలేదన్నారు. జూలై 6, జూలై 12న సరఫరా చేసిన నెయ్యి శాంపిళ్లనే ఎన్‌డీడీబీకి పంపామని లూథ్రా వెల్లడించారు.

నివేదిక జూలైలో వస్తే సీఎం సెప్టెంబర్‌లో ఎందుకు మాట్లాడారు..?

ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. ప్రశ్నల వర్షం కురిపించింది. ఎన్‌డీడీబీ నివేదిక జూలైలో వస్తే ముఖ్యమంత్రి సెప్టెంబర్‌లో ఎందుకు మాట్లాడినట్లని ప్రశ్నించింది. జూలైలో వచ్చిన నివేదికపై అప్పుడే ఎందుకు మాట్లాడలేదు? ఈ వ్యవహారంలో ప్రెస్ ముందుకెళ్లాల్సిన అవసరం ఏముంది? ముఖ్యమంత్రి స్వయంగా దర్యాప్తునకు ఆదేశించినప్పుడు మళ్లీ ప్రెస్ ముందుకు వెళ్లడం ఏమిటి? నెయ్యిలో జంతు కొవ్వు కలిపారంటూ ముఖ్యమంత్రి ప్రకటన చేశారు. అసలు ఈ ప్రకటన చేయడానికి ఆయన వద్ద ఉన్న ఆధారాలు ఏమిటి? లడ్డూల తయారీలో ఉపయోగించిన నెయ్యిలో కల్తీ జరిగిందని చెబుతున్నప్పుడు ఆ లడ్డూలను పరీక్షల నిమిత్తం ఎందుకు పంపలేదు? ప్రెస్ ముందుకు వెళ్లే ముందు లడ్డూలను పరీక్షించడం సరైనదని మీరు (సీఎం) భావించలేదా? జంతు కొవ్వు వాడారంటూ చేసిన ప్రకటన కోట్ల మంది ప్రజల మనోభావాలను దెబ్బతీస్తుందని తెలియదా? ప్రెస్ ముందుకెళ్లి ప్రకటనలు ఎందుకు చేయాలి? దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచండి. లడ్డూల తయారీలో కల్తీ నెయ్యి వాడారనేందుకు ప్రస్తుతం ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేవు. దర్యాప్తు జరుగుతుండగా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నవారు అలాంటి ప్రకటనలు చేయవచ్చా? దాని వల్ల సిట్ దర్యాప్తు ప్రభావితం కాదా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది.

తండ్రీకొడుకులకు ఒకే సారి టీచర్ ఉద్యోగులు



మరికల్: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో తండ్రీకొడుకులు టీచర్ ఉద్యోగాలు సాధించారు. నారాయణపేట జిల్లా మరికల్ మండలం రాకొండ గ్రామానికి చెందిన జంపుల గోపాల్ తెలుగు పండిత్ విభాగంలో జిల్లా మొదటి ర్యాంకుతో పాటు స్కూల్ అసిస్టెంట్ తెలుగులో జిల్లా మూడో ర్యాంకు సాధించారు. అలాగే పెద్ద కుమారుడు భానుప్రకాశ్ గణిత విభాగంలో స్కూల్ అసిస్టెంట్‌గా జిల్లాలో 9వ ర్యాంకు సాధించారు. గోపాల్ చిన్నకుమారుడు చంద్రకాంత్ ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఏఈగా ఉద్యోగం సాధించి, ఆర్‌డబ్ల్యూఎస్‌లో పనిచేస్తున్నారు. ఇక గోపాల్ భార్య విజయలక్ష్మి 2012 డీఎస్సీలో ఉద్యోగం పొంది.. ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేటలో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్నారు. తండ్రీకొడుకులకు ఒకేసారి ఉద్యోగం రావడంతో గ్రామస్తులు వారిని అభినందించారు.

కలెక్టరేట్‌లో గ్యారంటీ ప్రచారం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆరు గ్యారంటీలపై వినూత్న ప్రచారం చేస్తుంది. ఇప్పటికే కలెక్టరేట్ భవనంపై సంక్షేమ పథకాలను వివరించేలా పెద్ద బెలూన్‌ను ఏర్పాటు చేశారు. తాజాగా సబ్సిడీ గ్యాస్ పథకాన్ని వివరించేలా సిలిండర్ రూపంలో ఉన్న బెలూన్‌ను కలెక్టరేట్ ముఖద్వారం వద్ద ఏర్పాటు చేశారు. ఈ బెలూన్‌పై ఆరు గ్యారంటీ పథకాలతోపాటు ఇందిరాగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫొటోలు ఉన్నాయి. సోమవారం ప్రజావాణి కావడంతో కలెక్టరేట్‌కు వచ్చేవారు బెలూన్లను ఆసక్తిగా తిలకించారు.



తేలిన లెక్క..



పోలేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

- పోలేపల్లి పంచాయతీ నిధుల గోల్‌మాల్‌పై కలెక్టర్‌కు నివేదిక
- మొత్తం దుర్వినియోగం రూ.1.73 కోట్లు
- మాజీ సర్పంచ్ నుంచి రికవరీ.. పంచాయతీ కార్యదర్శిపై చర్యలకు సిఫార్సు

జడ్చర్ల: పోలేపల్లి గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగం లెక్క తేలింది. గ్రామ పంచాయతీకి విడుదలైన నిధుల వినియోగంలో అక్రమాలు జరిగాయని, పనులకు సంబంధించిన బిల్లులు లేకుండానే నిధులు డ్రా చేశారని నిర్ధారించారు. అసలు గ్రామసభలు నిర్వహించకుండానే.. పంచాయతీ తీర్మానాలు లేకుండానే నిధులు ఇష్టానుసారంగా వినియోగించినట్లు విచారణలో వెల్లడైంది. 2019- 20 నుంచి 2024- 25 వరకు పోలేపల్లికి విడుదలైన పంచాయతీ, రాష్ట్ర ఆర్థిక సంఘం, కేంద్ర ఫైనాన్స్ కమిషన్, పీఎఫ్ఎంఎస్, ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ నిధుల వినియోగంపై పూర్తిస్థాయిలో విచారించారు. ఈ క్రమంలో బిల్లులు, ఎంబీ రికార్డులు, ఓచర్లు సమర్పించకపోవడంతో మొత్తం రూ.1,73,20,013 దుర్వినియోగమైనట్లు విచారణలో గుర్తించారు. బ్యాంకు ఖాతా, క్యాష్ బుక్ తదితర రికార్డుల తనిఖీ అనంతరం అంశాలవారిగా నివేదికను విచారణాధికారి డీఎల్‌పీఓ పండరీనాథ్ జిల్లా ఉన్నతాధికారులకు సమర్పించారు.

దుర్వినియోగం ఇలా..

2019- 20 నుంచి 2023- 24 వరకు హరితహారం మొక్కల కొనుగోలుకు రూ.30,66,502 ఖర్చు చేసినట్లు చూపారు. కానీ, ఇందుకు సంబంధించి జీఎస్టీ బిల్లులు, ఓచర్లు లేవు. అలాగే గ్రామసభ తీర్మానం, డీపీఓ అనుమతి కూడా తీసుకోలేదు. అలాగే గ్రామంలో పారిశుద్ధ్య పనులు, పిచ్చిమొక్కల తొలగింపు, పాత ఇళ్ల కూల్చివేతకు సంబంధించి పల్లెప్రగతిలో జేసీబీ ఖర్చు కింద రూ.25,04,020 డ్రా చేశారు. వీటికి సంబంధించి కూడా ఎలాంటి ఎంబీ రికార్డు, అనుమతులు, తీర్మానాలు లేవు. సీసీరోడ్లకు సంబంధించి కలెక్టర్, గ్రామసభ అనుమతులు లేకుండా రూ.16,70,750 నిధులు వెచ్చించినట్లు పేర్కొన్నారు. అలాగే ఎనిమల్ క్యాచింగ్ ఖర్చుల కింద రూ.3,17,500, సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ తదితర పనులకు రూ.33,77,761 ఎంబీ తదితర రికార్డులు లేకుండా ఖర్చు చేశారు. లెక్కా పత్రం లేని పనులకు రూ.16,13,135 ఖర్చులను చూపారు. అడ్వాన్స్‌ల కింద రామచంద్రారెడ్డికి రూ.9,70,920, ఉపేందర్‌గౌడ్‌కు రూ.60 వేలు చెల్లించారు. వీడబ్ల్యూఎస్‌సీ (ఎస్‌బీఎం)కు సంబంధించి నిధుల నుంచి రామచంద్రారెడ్డికి రూ.9,24,018 అడ్వాన్స్‌గా చెల్లించారు. ఈ పద్దులు ఎక్కడా సర్దుబాటు కాలేదు. ఉపాధి హామీ పథకం కింద మొక్కలకు ట్యాంకర్ ద్వారా నీటి సరఫరాకు రూ.14,75,858 ఖర్చు చేశారు. ఇందుకోసం రామచంద్రారెడ్డికి రూ.11,25,858, నర్సింహులుకు రూ.3,50,000 చెల్లించినట్లు గుర్తించారు. నర్సరీ నిర్వహణకు రూ.3,80,165 ఖర్చుకు సంబంధించి కూడా ఎంబీ రికార్డు, గ్రామసభ ఆమోదం లేదని గుర్తించారు.

⇨ డీపీఓగా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన బి.వెంకటేశ్వర్లుకు వాహన అలవెన్సు రూ.2,22,484 చెల్లించారు. ఇందుకు సంబంధించి సదరు వ్యక్తి నుంచి చెల్లించిన మొత్తాన్ని రికవరీగా గుర్తించారు.

⇨ పోలేపల్లి గ్రామ పంచాయతీకి సంబంధించి వివిధ గ్రాంట్ల కింద విడుదలైన మొత్తం రూ.7,03,79,148లో రూ.1,73,20,013 గ్రామ పంచాయతీకి నష్టం వాటిల్లిందని, ఈ మొత్తాన్ని మాజీ సర్పంచ్ చేతనరెడ్డి నుంచి రికవరీ చేయాలని నివేదికలో సిఫారసు చేశారు.

రికార్డులు, బిల్లులు చూపించలేదు..

''పోలేపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తించిన శివప్రకాశ్ నిధుల వినియోగానికి సంబంధించి ఎంబీ రికార్డులు, ఓచర్లు, బిల్లులు విచారణ సమయంలో చూపించలేకపోయారని, అలాగే గ్రామ పంచాయతీ నిధి సంరక్షణ బాధ్యతను విస్మరించినందున అతనిపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేశారు. ప్రస్తుతం ఆయన హన్వాడ మండలం అమ్మాపూర్‌తండాలో పనిచేస్తున్నారు.' అని డీఎల్‌పీఓ పండరీనాథ్ తెలిపారు.

పాలమూరు హ్యాట్రిక్ విజయం



విజయం సాధించిన ఉమ్మడి జిల్లా జట్టుతో రాజశేఖర్, కోచ్ అబ్దుల్లా

90 పరుగుల తేడాతో మెదక్‌పై గెలుపు

మహబూబ్‌నగర్ క్రీడలు: వరంగల్‌లో జరుగుతున్న హెచ్‌సీఏ అండర్-19 వన్డే అంతర్ జిల్లా లీగ్ కమ్ నాకౌట్ టోర్నమెంట్‌లో ఉమ్మడి జిల్లా జట్టు హ్యాట్రిక్ విజయాలను నమోదు చేసుకుంది. సోమవారం వరంగల్‌లోని మొగిలిచర్ల మైదానంలో మెదక్ జట్టుతో జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌లో జిల్లా జట్టు 90 పరుగుల తేడాతో గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన జిల్లా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 217 పరుగులు చేసింది. జట్టులో ఓపెనర్ అబ్దుల్ రాఫే 54, అభిలాష్ 66, షాదాబ్ అహ్మద్ (53 నాటౌట్) పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మెదక్ జట్టు జిల్లా బౌలర్ల ధాటికి వరుసగా వికెట్లను కోల్పోయింది. 32.1 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌట్ అయింది. జిల్లా బౌలర్లు మహ్మద్ షాదాబ్ అహ్మద్ 4, ముఖితుద్దీన్ 2, అంకిత్‌రాయ్ 2, కనిష్క 1 వికెట్ తీశారు. టోర్నీలో వరుసగా మూడు మ్యాచ్‌లను గెలిచిన ఉమ్మడి జిల్లా జట్టును ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, కోచ్ అబ్దుల్లా అభినందించారు. సమష్టి ప్రతిభ కనబరిచి విజేతగా నిలవాలని ఆకాంక్షించారు.


11 యూనిట్లలో విద్యుదుత్పత్తి

జూరాలకు 68 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు/ఆత్మకూరు/దోమలపెంట: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు సోమవారం రాత్రి 9 గంటల వరకు ప్రాజెక్టుకు 68,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. దీంతో ప్రాజెక్టు 5 క్రస్టు గేట్లను ఎత్తి గేట్ల ద్వారా ఎత్తి 35,600 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో ఒక పంపును ప్రారంభించారు. విద్యుదుత్పత్తి నిమిత్తం ప్రాజెక్టు నుంచి 37,115 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. నెట్టెంపాడు ద్వారా 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 95 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 920 క్యూసెక్కులు, కుడి కాల్వకు 720 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి మొత్తం 75,200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా 9.132 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

⇨ జూరాల ఎగువ, దిగువ విద్యుదుత్పత్తి కేంద్రాల్లోని 11 యూనిట్లలో ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ సూరిబాబు తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 196 మెగావాట్లు, 212.716 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 186.736 ఎంయూ విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు.ఇప్పటివరకు 399.452 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని తెలిపారు.

⇨ శ్రీశైలం జలాశయంలో సోమవారం నీటిమట్టం 880.4 అడుగుల వద్ద 190.3330 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో స్పిల్‌వే ద్వారా 35,600 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 37,115, సుంకేసుల నుంచి 8,892 మొత్తం 81,607 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 36,163 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 22,197 మొత్తం 58,360 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా 13,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,480 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎంజీకేఎల్ఐకు నీటి విడుదల జరగలేదు. భూగర్భ కేంద్రంలో 16.335 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. కుడిగట్టు కేంద్రంలో 5.356 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేశారు.



జూరాల ప్రాజెక్టు వద్ద 5 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద నీరు

సుంకేసులలకు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసులకు సోమవారం ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగింది. ఎగువ నుంచి 11,337 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. రెండు గేట్లను తెరిచిన అధికారులు 8,892 క్యూసెక్కులు, కేసీ కెనాల్ కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ రాజు తెలిపారు.

రామన్‌పాడులో 1,021 అడుగుల నీటి మట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో సోమవారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1021 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 835 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేసారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 950 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వ ద్వారా 20 క్యూసెక్కులు తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్ రెడ్డి తెలిపారు.

జోగుళాంబ బ్రహ్మోత్సవాలకు మంత్రులకు ఆహ్వానం



మంత్రి దామోదర్ రాజనర్సింహను ఆహ్వానిస్తున్న ఆలయ ఈఓ



మంత్రి జూపల్లిని ఆహ్వానిస్తున్న ఆలయ ఈఓ

జోగుళాంబ శక్తిపీఠం: అక్టోబర్ 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే జోగుళాంబ దేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలకు దేవస్థాన కమిటీ సభ్యులు పలువురు మంత్రులను, ప్రముఖులను ఆహ్వానించారు. సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యులు, మల్లురవి, డీకే అరుణ, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్‌లకు ఆలయ ఈఓ పురేందర్ కుమార్, ప్రధాన అర్చకులు ఆనంద్ శర్మ, ఆహ్వాన పత్రికలు అందజేశారు. 1వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి 6 గంటల వరకు జోగుళాంబ అమ్మవారి దర్శనాలు నిలిపేస్తున్నట్లు ఆలయ ఈఓ తెలిపారు. భక్తులు సహకరించాలని ఈఓ కోరారు.

అవయవదానం



జయమ్మ (ఫైల్)

మక్తల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ మహిళ బ్రెయిన్ డెడ్ కావడంతో కుటుంబ సభ్యులు అవయవదానం చేసి మరో ఎనిమిది మందికి ప్రాణం పోశారు. వివరాల్లోకి వెళ్తే.. మక్తల్‌కు చెందిన జయమ్మ ఈ నెల 24న మాగనూర్ మండలంలోని మారెమ్మ దేవతను దర్శించుకునేందుకు బస్సులో బయలుదేరింది. అక్కడ దిగే క్రమంగా కాలుజారి కిందపడటంతో తీవ్రంగా గాయపడింది. దీంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. బ్రెయిన్‌డెడ్ కావడంతో భర్త చాకలి లక్ష్మణ్ ఆమె అవయవాలను ఓ స్వచ్ఛందసంస్థ ద్వారా ఎనిమిది మందికి దానం చేశారు. ఆదివారం రాత్రి స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.